క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: చీరాల మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఐసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు అందరూ హాజరుకావాలన్నారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం పుష్య మాసం పూర్వాషాఢ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నేడు అంజన్నకు అరటిపండ్లతో పూజ

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి అమావాస్య సందర్భంగా శనివారం అరటిపండ్లతో పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు శుక్రవారం దేవస్థాన కార్య నిర్వహణాధికారి సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు స్వామివారి దర్శించుకోవాలని కోరారు.

22న ప్రాంతీయ విద్యా సదస్సు

కారంచేడు: పర్చూరు ప్రాంతీయ విద్యా సదస్సును ఉపాధ్యాయులు కలిసికట్టుగా విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావి పద్మావతి, పీ నాగమణిలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 22వ తేదీ ఆదివారం ఉదయం పర్చూరు నాంచారమ్మ కల్యాణ మండపంలో జరిగే ఈ సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు తప్పకుండా హాజరై విజయంతం చేయాలని వారు కోరారు.

108 ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా హరిబాబు



హరిబాబు

అద్దంకి రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా 108 ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా అద్దంకి ఈఎంటీగా పనిచేస్తున్న పీ. హరిబాబు శుక్రవారం ఎన్నిక య్యారు. ఆరు డివిజన్ల అధ్యక్ష, కార్యదర్శుల సమక్షంలో ఏకగ్రీవం ఎన్నుకున్నట్లు హరిబాబు తెలిపారు.

అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ



వెండికిరీటం, ముఖం అలంకరణలో అమ్మవారు

చినగంజాం: స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి దాతలు శుక్రవారం వెండి కిరీటం బహూకరించారు. గ్రామానికి చెందిన మాజేటి కామేశ్వరమ్మ అనే భక్తురాలు ఆలయంలోని అమ్మవారికి వెండి కిరీటం, అమ్మవారికి రూపు, వెండి ముఖం చేయించి శుక్రవారం ఆలయ పూజారి కాకుమాను రాము, కొల్లిపర అప్పారావులకు అప్పగించారు. కార్యక్రమంలో దాతలు కామేశ్వరమ్మ, మురళి, రమణ, భక్తులు పాల్గొన్నారు.

వలంటీర్లపై విషపు రాతలు సిగ్గుచేటు

- ఎల్లో మీడియాలో వార్తలపై ఖండన
- టీడీపీపై ధ్వజమెత్తిన నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

అద్దంకి రూరల్: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ మంచి ఫలితాలు ఇవ్వటంతో దేశంలోని అన్ని రాష్ట్రాలు మన రాష్ట్రం వైపుచూస్తుంటే ఎల్లో మీడియాలో మాత్రం వలంటీర్ వ్యవస్థపై విషపురాతలు రాయటం సిగ్గుచేటని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య మండిపడ్డారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎల్లో మీడియాలో వలంటీర్లపై వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. వలంటీర్లు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందిస్తున్నారన్నారు. కరోనా సమయంలో వలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తుచేశారు. ఏనాడు పార్టీ కార్యక్రమాలకు వలంటీర్లను వినియోగించుకోలేదన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల్లాగా ప్రజల సొమ్మును దోచుకోవటంలేదన్నారు. చంద్రబాబుకు పట్టం కట్టబెట్టాలని రామోజీరావు, ఏబీఎన్ రాధాకృష్ణలు పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు వలంటీర్ల సేవలను కొనియాడుతున్నారన్నారు. ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎవ జగనన్నకు దక్కుతుందన్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరూ ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్‌కేర్ సెంటర్ల ద్వారా ప్రతి ఒక్కటీ ప్రజల ముంగిటికే వచ్చాయన్నారు. వలంటీర్లను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చెయ్యాలని చూస్తే వారికే నష్టం ఏర్పడుతుందన్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో అద్దంకి మున్సిపల్ వైస్‌చైర్మన్ పద్మేష్, నాయకులు కాకాని రాధాకృష్ణమూర్తి, పూనూరి నరేంద్ర, గోపాపురం చౌదరి, సర్పంచ్ అనిల్, టి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం..

చీరాల అర్బన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటి ముంగిటకు అందించేందుకు వారధిగా ఉన్న వలంటీర్ల వ్యవస్థపై ఎల్లో మీడియా విషపు రాతలు రాయడం మానుకోవాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారన్నారు. ప్రతి గ్రామ, పట్టణాలలో వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను నేరుగా వారికి అందించేందుకు వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారన్నారు. వలంటీర్లు ప్రజల పట్ల బాధ్యతతో ప్రభుత్వం పట్ల విశ్వాసంతో నమ్మకంగా పనిచేస్తున్నారని, అటువంటి వ్యవస్థపై ఎల్లో మీడియా విషపు రాతలు రాసి పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి నియంత పాలన సాగించారన్నారు. జన్మభూమి కమిటీల ఆకృత్యాలను ఏ రోజూ ఎల్లో మీడియా ప్రశ్నించలేదని, పత్రికలలో రాయలేదని అన్నారు. వలంటీర్ల వ్యవస్థకు, జన్మభూమి కమిటీలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు కూడా నేరుగా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలోనే జమ అవుతుందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్ల ద్వారా పెన్షన్లు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు వ్యవస్థను మెచ్చుకుంటున్నాయని, ఎల్లో మీడియాకు అవి కనిపించవని చురకలంటించారు. ఇప్పటికైనా విషపు రాతలు మానుకొని వాస్తవాలను ప్రజలకు అక్షర రూపంలో అందించాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, గుంటూరు ప్రభాకరరావు, కె.యానాదిరావు, పార్టీ నాయకులు కోడూరి ప్రసాద్‌రెడ్డి, అప్పల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసరావు

పట్టణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



లబ్ధిదారులకు నమస్కరిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య

అద్దంకి: పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఒకటో వార్డులో కౌన్సిలర్ బాలుతో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి లబ్ధి పత్రాలను పంపిణీ చేశారు. యువకులు, వృద్ధులను పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ పట్టణంలో సీసీ డ్రైన్లు, సీసీ రహదారులు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో పనులు చేయిస్తామని పేర్కొన్నారు. దర్శి రహదారిలో సెంట్రల్ లైటింగ్ పూర్తయిందని, డివైడర్ ప్లాస్టింగ్ పనులతో మొక్కలు నాటుతామన్నారు. పచ్చదనం కోసం ప్రతి ఇంట్లోనూ మొక్కలు పెంచాలని చెప్పారు. ఇచ్చిన హామీలకన్నా ఎక్కువ పనులు చేశామని గుర్తుచేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన మొట్టమొదటి సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని చెప్పారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మరలా మరలా మనం గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు కార్యకర్తలు ప్రతిపక్షాల కుట్ర రాజకీయాన్ని బట్టబయలు చేసి రాబోయో ఎన్నికల్లో రాష్ట్రంలో, నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎల్ ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, పట్టణ పార్టీ నాయకుడు కాకాని రాధాకృష్ణమూర్తి, సందిరెడ్డి రమేశ్, వార్డు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, కో అప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో యాజమాన్యం

వేటపాలెం: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రీసెర్చ్ అసోసియేట్స్ అండ్ కన్సల్‌టెంట్స్ ఆఫ్ ఇంజినీరింగ్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో పది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో శుక్రవారం తెలిపారు. కళాశాల్లో 2023 ఎంబీఏ, ఎంసీఏ పూర్తి కాబోయే విద్యార్థులకు మేనేజరు ఉద్యోగాలకు నిర్వహించిన ఎంపికల్లో భాగంగా మొదట బృంద చర్చల్లో 96 మంది విద్యార్థులు పాల్గొనట్లు తెలిపారు. అందులో హెచ్ఆర్ ఇంటర్వ్యూకు 36 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. వీరిలో పది మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. వీరిలో ఎంబీఏలో ఏడుగురు, ఎంసీఏలో ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు రూ. 3 లక్షలు వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు లభిస్తాయని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి ఎస్ పూర్ణచంద్రరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఎంబీఏ విభాగాధిపతి ఆర్ ఇమ్మానుయేల్, ఎంసీఏ విభాగధిపతి సి హరికిషన్ అభినందించారు.

నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి లేదు



కాలేజీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్సై జనార్దన్

చీరాల: ఈనెల 22న జరగనున్న కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లను ఈపూరుపాలెం ఎస్సై పీ జనార్దన్ పరిశీలించారు. శుక్రవారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్షకు సంబంధించి ఏర్పాట్లపై ఆయన కాలేజీ సిబ్బందితో మాట్లాడారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులకు సంబంధించి ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలి, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బషీర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి 10గంటల వరకు అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, ప్రతి అభ్యర్థి హాల్ టిక్కెట్, గుర్తింపు కార్డును తీసుకురావాలన్నారు. క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌వోడి శ్రీకాంత్, ఏవో ఫణికుమార్, సిబ్బంది ఉన్నారు.

వర్మీ కంపోస్టు తయారీతో ఆదాయం



అంబడిపూడిలో వర్మీ కంపోస్టును పరిశీలిస్తున్న డీపీవో



క్లాప్ మిత్రలను సత్కరిస్తున్న డీపీవో, డీఎల్‌డీవో

- డీపీవో శంకర్ నాయక్

బల్లికురవ: గ్రామాల్లోని తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా చెత్తనుంచి సంపద కేంద్రాలకు తరలించి వర్మీ కంపోస్టు తయారీతో ఆదాయం పెంచుకోవచ్చని బాపట్ల జిల్లా డీపీవో శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పెదఅంబడిపూడి, వేమవరం గ్రామాల్లో చెత్తనుంచి సంపద కేంద్రాలు, సచివాలయాలు, స్వమిత్ర సర్వేను డీపీవో పరిశీలించారు. చెత్తనుంచి సంపద కేంద్రాల్లో ఉన్న 12 పిట్లలో వర్మీకంపోస్టు తయారు చేయాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మాణం చేపట్టని గ్రామాల్లో కూడా సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధతో తక్షణమే నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. చెత్తనుంచి సంపద కేంద్రాల్లో పని చేస్తున్న క్లాప్‌మిత్రలను ప్రత్యేకంగా అభినందిస్తూ డీపీవో సత్కరించారు.

బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలి..

ప్రభుత్వం గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటు పౌరసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయంలో పనిచే స్తున్న వివిధ శాఖల ఉద్యోగులు విధులు, బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలని డీపీవో శంకర్ నాయక్ కోరారు. వేమవరం సచివాలయంలో రికార్డులు అటెండెన్స్, మూవ్‌మెంట్ రిజిస్టర్, స్పందన అర్జీల రిజిస్టర్‌ను డీపీవో పరీక్షించారు. స్వమిత్వా సర్వేలో అవకతవకలు లేకుండా పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. పరిశీలనలో డీఎల్‌డీవో రాజేష్, ఈవోఆర్డీ, సీతామహాలక్ష్మి, ఏపీవో బాలకృష్ణనాయక్ ఆయా గ్రామాల సెక్రటరీలు పాల్గొన్నారు.

మాదిరి పరీక్షకు 200 మంది విద్యార్థుల హాజరు



ప్రశ్నపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్ఎంఎంఎస్ మాదిరి పరీక్షకు 200 మంది విద్యార్థులు హాజరైయ్యారు. పరీక్ష అజిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ట్రస్ట్ చైర్మన్ వీ వీరనారాయణ తెలిపారు. పరీక్షకు ముందు అజిత్ కుమార్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అద్దంకి, బల్లికురవ, కొరిశపాడు, ఇంకొల్లు, పంగులూరు మండలాల నుంచి 16 పాఠశాలల విద్యార్థులు హజరయ్యారు. పరీక్ష పత్రాన్ని వీరనారాయణ పాఠశాల ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మాత్రమే ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాయటానికి అర్హులని అన్నారు. పరీక్షలో ఉతీర్ణులైన వారికి కేంద్ర ప్రభుత్వం రూ. 12 వేలు ఉపకార వేతనం అందిస్తుందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రభుత్వం ఫిబ్రవరి 4వ తేదీన జరగనున్నట్లు తెలిపారు.

శ్రీరాముడి పాదుకలను సందర్శించిన భక్తులు

చినగంజాం: అయోధ్య నుంచి శ్రీరామభక్త సమాజం వారిచే శ్రీరాముని పాదుకలను శుక్రవారం చినగంజాం గ్రామంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ మందిరానికి భక్తుల దర్శనార్థం తీసుకొని వచ్చినట్లు కమిటీ వారు శుక్రవారం తెలిపారు. అయోధ్య నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన పాదుకలు కావడంతో భక్తులు విశేషంగా దర్శించుకున్నారు.



పాదుకలను దర్శించుకుంటున్న భక్తులు

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



పరీక్ష కోసం సిద్ధం అవుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చినగంజాం: ఎన్‌సీసీ శిక్షణతో విద్యార్థుల్లో చిన్నవయసు నుంచే క్రమశిక్షణ అలవడుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానంద రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సర్టిఫికెట్ కోసం పరీక్ష రాసేందుకు సిద్ధం అవుతున్న ఎన్‌సీసీ విద్యార్థుల గురించి ఆయన మాట్లాడారు. పాఠశాల నుంచి 33 మంది ఎన్‌సీసీ విద్యార్థులు ఎన్‌సీసీ ఏ సర్టిఫికేట్ పరీక్ష రాసేందుకు ఎన్‌సీసీ అధికారి సీహెచ్‌వీ సుబ్బారావు సంసిద్ధులను చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ పొందిన 9,10 తరగతులు విద్యార్థులు చీరాల ఎన్ఆర్ పీఎం పాఠశాలలో రాత పరీక్ష రాయడంతో పాటు డ్రిల్ టెస్ట్, వెపన్ ట్రైనింగ్, మ్యాపింగ్ టెస్ట్‌లకు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎన్‌సీసీ అధికారి ఎస్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా గుర్తించాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మేదరమెట్ల: గణతంత్ర దినోత్సవాన్ని అంబేద్కర్ రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా గుర్తించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పరిరక్షణ సమితి నాయకుడు తేళ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26వ తేదీన మండలంలోని అన్ని గ్రామాల్లో దళిత సోదరులందరూ రిపబ్లిక్ దినోత్సవాన్ని రాజ్యాంగ ఆమోద దినోత్సవంగా నిర్వహించాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ పథకాన్ని పరిధి లేకుండా చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా దళితుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు రూపొందించి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పేరం సతీష్‌బాబు, సర్దార్‌ఖాన్, గోలి రమణబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

భయం వీడితే విజయం సాధ్యం



తరగతులను పరిశీలిస్తున్న మండల నోడల్ టీం

చినగంజాం: విద్యార్థులు భయం వీడితే పరీక్షల్లో విజయం సాధించవచ్చని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన విజయస్మృతి పరీక్షల సంసిద్ధత 51 రోజుల కార్యక్రమ నిర్వాహణను మండల నోడల్ టీం శుక్రవారం పరిశీలించింది. 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విజయ స్మృతి కార్యక్రమంలో భాగంగా 51 రోజుల పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి, రీడింగ్ తరగతులు ఏర్పాటు చేసి విద్యార్థుల నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా తయారు చేయడంలో మండల నోడల్ టీంను ఏర్పాటు చేయడంతో వారు మండలంలోని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేసేందుకు అవసరమైన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నోడల్ టీం నందు చినగంజాం, కడవకుదురు ఉన్నత పాఠశాలల హెచ్ఎం డీ రత్నకుమారి, బీ ప్రసన్నకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఒంగోలు: జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీ ఆర్ చౌదరి కోరారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరలు, కూలి ఖర్చులు పెరిగినందున ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలకు బదులుగా రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 30వ తేదీ వరకు జగనన్న కాలనీ లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలపై సంతకాలు సేకరించనున్నట్లు తెలిపారు. 30వ తేదీ మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో బాధితులతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నగర నాయకులు పాల్గొన్నారు.